క్లుప్తంగా

12న వలంటీర్ల నియామకం

వేంపల్లె : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్లను నియమిస్తున్నట్లు ఎంపీడీఓ దివిజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముతుకూరులో 2, అయ్యవారిపల్లెలో 1, వేంపల్లెలో 2 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 12న ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓను సంప్రదించాలని సూచించారు.

నేడు కార్తీక వన భోజనం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీ హాల్లో ఆదివారం కార్తీక మాస వన మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఆప్యాయ పలకరింపులు, పరిచయ కార్యక్రమాలు ఉంటాయని సంఘ అధ్యక్షుడు గురుప్రసాద్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

జమ్మలమడుగు రూరల్: మిచాంగ్ తుపాను వల్లపంటలను నష్టపోయిన రైతు కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాయలసీమ రాష్ట్ర జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల వచ్చిన తుపాను వల్ల చాల వరకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. తక్షణ సాయం కింద ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 7 వేల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి రైతు కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ప్రధానమంత్రిని లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు.

రేపటి నుంచి ప్రత్యేక కౌంటర్

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఉలిమెల్ల రోడ్డులోని అహోబిలాపురం స్కూలు దగ్గర ఉన్న అన్నా క్యాంటీన్‌లో సోమవారం నుంచి కరెంటు బిల్లు కనెక్షన్ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గరీబ్ కళ్యాణ్ యోజన పేదలకు వరం



రేషన్ బియ్యం వాహనం వద్ద బీజేపీ నేతలు

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యం వరం లాంటిదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బి.విజయ్‌తో కలిసి రేషన్ ఇచ్చే వాహనాలకు మోదీ బొమ్మను అతికించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజల పట్ల చిత్తశుద్ధితో బీజేపీ ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని మరో 5ఏళ్ల వరకు పొడిగించడం శుభపరిణామమన్నారు. బీజేపీ నాయకులు సుష్మా, సునీల్, ప్రసాద్ రెడ్డి, సుమన్, పవన్‌కుమార్, లోకేష్, సురేందర, సాయి, చంద్ర, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు ఉపయోగకరం



విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో భాకరాపురం, కోవరంగుంటపల్లె పీహెచ్‌సీల ల్యాబ్ టెక్నీషియన్లు శ్రావణి, సురేష్, సంపత్‌కుమార్, రక్తనిధి ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ రఫి సుమారు 670మంది విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీలు చేసి వారి వారి రక్త గ్రూపులు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి, కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డి.వి. నారాయణరెడ్డి, ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ వై.జి.హర్షవర్ధన్ రెడ్డి వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీఎంను మరోసారి ఆశీర్వదించాలి

- ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, శిల్పా రవి
- అభివృద్ధి పనుల ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, రవిచంద్ర కిషోర్ రెడ్డి

పెద్దముడియం: ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి తెలిపారు. శనివారం వారు మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో రూ.87 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు.అనంతం గ్రామంలో భూమిలేని నిరుపేదలయిన 118 మందికి 1.5 ఎకరాల చొప్పున భూమి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎక్కువగా పారిశ్రామీకరణ,వ్యవసాయ రంగాలకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. కొందరు ఈ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని విమర్శించడం సరికాదన్నారు. రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలో 1.25 లక్షల సచివాలయ ఉద్యోగాలు,2 లక్షల వలంటీర్లను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న సుపరిపాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లడం కన్నా అభివృద్ధి ఏముంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంత రెడ్డి, భాస్కర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కిట్టయ్య, చవ్వా కృష్ణారెడ్డి, తలారి మహేష్, గ్యాస్ శివారెడ్డి, సి.సుధాకర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడాలి

జమ్మలమడుగు: ప్రతి కార్యకర్త పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎర్రగుంట్లలోని పార్టీ కార్యాలయంలో నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ప్రభుకుమార్‌కు నియామక పత్రాన్ని అందించారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నేడు ప్రారంభోత్సవాలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): మైలవరం మండలంలోని పెద్ద కొమెర్ల గ్రామంలో సుమారు రూ.2 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి తెలిపారు. శనివారం ఆమె స్వగ్రామంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే మినరల్ వాటర్ ప్లాంట్, సీసీ రోడ్లు, నాడు నేడు క్రింద స్కూల్ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆమె తెలిపారు. వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

రేపు కోన మల్లేశ్వరస్వామి తిరుణాల



కోనమల్లేశ్వర స్వామి మూల విరాట్



ఆలయాల సముదాయం

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామ సమీపంలో వెలసిన కోనమల్లేశ్వరస్వామి తిరుణాలను కార్తీక మాస చివరి సోమవారం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిరుణాల రోజున లింగాల, సింహాద్రిపురం, పులివెందుల, అనంతపురం ప్రాంతాలనుంచేకాక కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారన్నారు. దేవస్థానం వారిచే సోమవారం ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిరంతరాయంగా అన్నదానం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నేడు ఆలయాలు ప్రారంభం

లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో ఆదివారం మారెమ్మ, మాలే గంగమ్మ దేవాలయాలను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు నాగభూషణం రెడ్డి తెలిపారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో ఎండోమెంట్ కింద ఒక్కో ఆలయానికి రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయని.. ఈ నిధులకు తోడు గ్రామసుతల సహాయ సహకారాలతో ఆలయాలను నిర్మించామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని మైలవరం ఎస్ఐ కృష్ణయ్య పేర్కొన్నారు. శనివారం రాత్రి మైలవరం మండలంలోని తొర్రివేముల గ్రామంలో పోలీస్ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలకు గొడవపడటం తగదన్నారు. ఏమైన సమస్యలు ఉంటే పోలీస్ అధికారులకు దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలోని ఇరు పార్టీ నాయకులను పిలిపించి వారిని అవగాహన కల్పించారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు హర్షణీయం

పులివెందుల రూరల్ : ఆరోగ్యశ్రీ సాయం పెంపు నిర్ణయం చారిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ పేర్కొన్నారు. శనివారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2లక్షల వరకు ఉన్న ఆరోగ్యశ్రీ ఆర్థిక సాయం రూ.25లక్షల వరకు పెంచడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా ఏపీ సీఎం జగన్ విప్లవాత్మక పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

అనుమానిత వ్యక్తులు ఉంటే సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

పులివెందుల :లాడ్జిలలో అనుమానం ఉన్న వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో వారు లాడ్జిల యజమానులు, ఫంక్షన్ హాళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాడ్జిలకు వచ్చేవారి వద్ద నుంచి కచ్చితంగా వారి ఆధారాలు తీసుకోవాలని.. లేకపోతే రూములు ఇవ్వొద్దని సూచించారు. లాడ్జిలకు వచ్చే వారి వివరాలను పక్కాగా పుస్తకాలలో పొందుపరచాలన్నారు. అలాగే అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా విఘ్నేశ్వరరావు

పులివెందుల రూరల్ : పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వరాజ్ సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కె.విఘ్నేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం చిన్నపిల్లల వార్డు, పురుషుల, మహిళలను వార్డులను ఆయన తనిఖీ చేశారు.

ఘనంగా పాఠశాల శత వసంతోత్సవం



పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రూరల్ సీఐ, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని బి.చెర్లోపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు కలిసి శత వసంతోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. అలాగే పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం, బుద్ధుని ఆయిల్ పెయింట్ చిత్రపటాన్ని పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.కె.రోషన్, ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి, సర్పంచ్ గంగయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

కడప కార్పొరేషన్: మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని హరూన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌బి అహ్మద్ బాషా అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గోల్డెన్ సంఘం ఫంక్షన్ హాలులో సామాజిక సేవలందించిన పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు పొందుపరిచారని, ఎక్కడైతే మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందో అక్కడ ఈ సంస్థ సభ్యులు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సలహాదారు ముఫ్తీ సయ్యద్ మహమ్మద్ అలీ బాగ్దాది, ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషన్ సభ్యులు ఎస్. హిదాయతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవరాజు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలని పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న మహిళలు, యువకులు

లింగాల: లింగాల నుంచి తిరుమలకు శనివారం పాదయాత్రగా సుమారు 50మంది భక్తులు బయలుదేరారు. ఈ పాదయాత్ర బృంద ఆర్గనైజర్ ఎ.శివరామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ పాదయాత్రతో 13వ సారి పాదయాత్రగా వెళుతున్నామని.. శనివారం బయలుదేరి 14వ తేదీన తిరుమల కొండకు చేరుకుంటామన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి సన్నిధిలో 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

రేపటి నుంచి ఆర్‌ఓబీ పనులు ప్రారంభం

విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కమలాపురం: కమలాపురంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మించేందుకు సీఓటీ (కమిషన్ ఆఫ్ టెండర్) వచ్చిందని, సోమవారం నుంచే పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్‌ఓబీ భూమి పూజ, నిర్మాణం గురించి టీడీపీ నాయకులు ఆర్అండ్‌బీ ఎస్ఈ వద్దకు వెళ్లి వాగ్వాదం చేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు సైతం గత ఎన్నికల ముందు శిలాఫలకం వేశారని, అలాంటి వారికి ఈ ఆర్‌ఓబీ నిర్మాణం గురించి అడిగే అర్హతే లేదన్నారు. గతంలో చాలా సార్లు టెండర్లు పిలిచినప్పటికి కాంట్రాక్టర్లు సుముఖత చూపలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సేతుబంధు ద్వారా ఈ ఆర్‌ఓబీ నిర్మాణం మంజూరైందన్నారు. సీఓటీ కూడా వచ్చిందని, 90శాతం ప్రాసెస్ పూర్తి అయిందని, కేవలం రెండు రోజుల్లో అగ్రిమెంట్ పూర్తి అవుతుందని వారు స్పష్టం చేశారు. మన పూర్వీకుల నుంచి రైల్వే గేటు సమస్య ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పరిష్కరిస్తుంటే దానిని అభినందించాల్సింది పోయి టీడీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఆర్‌ఓబీ పనులు ప్రారంభించి ఏడాదిలోపే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వస్తామని వారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మస్తానయ్య, దేవదానం, లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం... రాజ మార్గం

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్.లావణ్య
- లోక్ అదాలత్‌లో 389 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం: కేసుల పరిష్కారంలో రాజీ మార్గం ... రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎన్.లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 389 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 378 క్రిమినల్, 8 సివిల్, 3 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. మెజిస్ట్రేట్ కక్షిదారులను చేతులు కలిపి రాజీ చేశారు.అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ లావణ్య మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. న్యాయవాదులు పుష్పరాజు, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనువాసులు, ఉదయ్, మహేష్, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి

జమ్మలమడుగు రూరల్: చిన్న చిన్న తగదాలను రాజీ చేసుకోవడం రాజ మార్గమని జమ్మలమడుగు ఎస్ భార్గవి అన్నారు. శనివారం కోర్ట్ ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భముగా జడ్జీ మాట్లాడూతు గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని చిన్న చిన్న సమస్యలతో కేసులు పెట్టుకోని స్టేషన్ల చుట్టూ తిరగడం వల్ల డబ్బులు వృధాగా అయిపోతాయని ఆమె తెలిపారు. పోలీస్ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గోన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సింహాద్రిపురంలో పార్కు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

సింహాద్రిపురం: మండల కేంద్రమైన సింహాద్రిపురంలో దాదాపు రూ.200కోట్ల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఈనెలాఖరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి పనుల ప్రారంభానికి వస్తున్న సందర్భంగా వైఎస్సార్ నూతన పార్కు, హెలీకాప్టర్ దిగే స్థలం, వాహనాల పార్కింగ్ సభా స్థలిని పరిశీలించారు. మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ శేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఎంపికలు ప్రారంభం



క్రికెట్ ఎంపికలను పరిశీలిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ, సెలక్షన్ కమిటీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-14 బాలురు, అండర్-17 బాలబాలికల విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత ఆదరణ ఉన్న క్రికెట్ ఎంపికలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 12న నరసరావుపేటలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో క్రికెట్ సెలక్షన్ కమిటీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, బాలశేఖర్, సుబ్బయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మావతి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికల్లో గందరగోళం..

క్రికెట్ ఎంపికలకు సంబంధించిన సమాచారాన్ని క్రీడాకారులకు తెలియకపోవడంతో గతంతో పోలిస్తే తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఎంపికల ప్రక్రియలో సైతం సెలక్షన్ కమిటీ సరిగా వ్యవహరించలేదని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు వాగ్వాదానికి దిగారు. ప్రతిరోజూ స్టేడియంకు వచ్చి సాధన చేస్తున్న క్రీడాకారులను పక్కన పెట్టడం సరికాదంటూ ప్రశ్నించారు. ఎంపికల ప్రక్రియలో తలెత్తిన గందరగోళంపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారిని వివరణ కోరగా.. బాగా ఆడే క్రీడాకారుల మధ్య పోటీ వచ్చినప్పుడు ఇలాంటి సమస్యలు వస్తున్నాయని, ఎంపికల ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని పేర్కొన్నారు. మంచి జట్టునే జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న వైద్య విభాగం జోనల్ అధ్యక్షుడు డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ శివానాయక్

కడప కార్పొరేషన్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యమని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి వారణాసి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆరోగ్య శ్రీకి కొన్ని వేల కోట్లు ఖర్చుపెడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. రాష్ట్రంలో నూతన మెడికల్ కాలేజీలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ఆరోగ్య శ్రీ లో గతంలో రెండు లక్షల యాభై వేలు ఉన్న పరిమితిని ముఖ్యమంత్రి ఇరవై ఐదు లక్షల వరకు పెంచడంతో ఎంతో మంది దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఖరీదైన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివా నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా 108, 104, సురక్ష వాహనాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచిత వైద్యాన్ని వారి ఇంటి వద్దనే అందేలా చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికీ నూతన ఆరోగ్యశ్రీ కార్డులు అందించేందుకు ఈ నెల 25 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు సచివాలయాల పరిధిలో జరగనున్నాయన్నారు. త్వరలో రిమ్స్‌లో మానసిక వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్ ప్రారంభం కానున్నాయన్నారు. తద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డాక్టర్ సతీష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి వాహనాల పంపిణీ



మురుగునీటి శుద్ధి వాహనాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని స్వచ్ఛత ఉద్యమి యోజన పథకంలో భాగంగా కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు మురుగునీటి శుద్ధి వాహనాలను అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పోరేషన్ ద్వారా వైఎస్సార్ జిల్లాకు స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం ద్వారా రూ.2.53 కోట్ల విలువ చేయు ఎనిమిది వాహనాలను మంజూరు చేసింది. ఈ వాహనాలను శనివారం కడపలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, కలెక్టర్ విజయ్ రామరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అందజేశారు. ఒక్కో వాహనం రూ. 31.67 లక్షలు కాగా, అందులో ప్రభుత్వం రూ. 15.06 లక్షలు సబ్సిడీ పోను ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణం రూ. 16.60 లబ్ధిదారులు 72 వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఎస్సీ కార్పొరేషన్ సంచాలకులు డాక్టర్ వెంకట సుబ్బయ్య, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, నగర డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు జమాల్ బాషా పాల్గొన్నారు.